## నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## మందుల వార్షిక ఇండెంట్‌లను పారదర్శకంగా పెట్టాలి.



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna


హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 235 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 20 ఆగస్టు 2026

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

● బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి ● వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి ● బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి సూచన



**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓ-ఙాఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. కింద రూ.4,463 కోట్ల విలువైన మిగతా2లో...



## ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

భూసేకరణలో బాధితులను పట్టించుకోరా..?

కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను మిగతా2లో...



## లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర మిగతా2లో...

## సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం



- ప్రజలతో మమేకమే లక్ష్యంగా పీఏసీ సమావేశం

**నిజామాబాద్, ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్


మిగతా2లో...

# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

● కోవిడ్ రికార్డుల దాపరికం నిజమేనని ఒప్పుకోలు ● నవంబర్ 12న శిక్ష ఖరారు చేయనున్న కోర్టు ● ప్రపంచవ్యాప్త తప్పిదాన్ని చైనాపైకి నెట్టే ప్రయత్నంవెల్లడవుతున్న వాస్తవాలు..అమెరికా ఫెడరల్ కోర్టులో నేరాన్ని అంగీకరించిన ఫౌచీ సలహాదారు డేవిడ్ మోరెన్స్



**గ్రీన్‌బెల్ట్ (మేరీల్యాండ్),ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** కోవిడ్ మహమ్మారి చైనా లేబొరేటరీస్ నుంచి ప్రపంచంలోకి విస్తరించిందని అమెరికా చేసిన ప్రచారం అవాస్తవమని తేలిపోయింది. తాను చేసిన తప్పుల్ని చైనా మీదకు నెట్టి, ఆ దేశాన్ని అభాసుపాలు చేయాలనే ప్రయత్నాల గుట్టురట్టు అయ్యింది. కోవిడ్ సమయంలో అంతటి దుష్ప్రచారం తమ దేశంపై జరుగుతున్నా, చైనా భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టిందే తప్ప, ఏనాడు ఏ దేశాన్ని నిందించలేదు. దీనితో భారతదేశంలో కూడా చైనా లేబరేటరీల నుంచే కోవిడ్ మహమ్మారి వచ్చిందనే ప్రచారాన్ని మిగతా2లో...



2లో

## ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

● ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి ● పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి ● అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం



**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న మిగతా2లో...

## అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

- ఎన్నికల సంఘం

సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం



2లో

## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు

సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



2లో

# ప్రశ్నిస్తే..అరెస్టులా?

● మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్

● నివాసాల వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదారబాద్ సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసానిని పోలీసు లు హౌస్ అరెస్టు చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద నార్సింగి ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు. కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి నార్సింగ్ పోలీసులు వెళ్లి, వారిని బయటికి వెళ్లకుండా ముందుగానే హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్ట్ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మిగతా2లో...

# 22/ఏ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలు ఏమిటి?
గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఏభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

22/ఏ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ది పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

# ప్రశ్నిస్తే..అరెస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

అక్కడికి చేరుకుని అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఆస్పత్రి సందర్శనకు వెళ్లకుండా ఎలాంటి అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. ఆస్పత్రుల్లోని డొల్లతనం, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతా యనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై నిరంతరం బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు.

### ఎమ్మెల్యే తలసాని హౌజ్ అరెస్ట్

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు అక్రమ నిర్బంధాలు, తప్పుడు కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆస్పత్రి సందర్శనకు వెళ్తామంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని నిలదీశారు. అక్రమ నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలకు త్వరలోనే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అర్హులు ఓటరు జాబితాలో..అనర్హులు జాబితా బయట

**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు.
అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు.

ఫారం 6, 6ం, 7, 8పై కెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

## - సంస్కరణలపై సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):**నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

## వాటిని అప్పడే తెరిచేలా చేయకండి

## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):**ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

(మొదటి పేజీ తరువాయి)

మోడీ సర్కారు నిరోధించేచర్యలు చేపట్టలేదు. కాలం గిర్రున తిరిగి, నిజం నిలకడ మీద ప్రపంచానికి తెలిసి వస్తున్నది. అసలు కోవిడ్ వైరస్‌పై ప్రయోగాలు చేసింది అమెరికానే అనీ, ఆ దేశం దానికోసం నిధుల్ని కూడా సమకూర్చిందని ఆ ఆపరేషన్‌లో భాగస్వాములు అయిన మాజీ అధికారులు ఇప్పుడు స్పష్టంచేస్తున్నారు. దీనిపై అమెరికాలో నమోదైన కేసుల్లో ఇప్పటికే పలువురు అరెస్టు అయ్యారు. కరోనా పరిశోధనలకు అమెరికా నిధులు సమకూర్చిం దని ఆ దేశ మాజీ అధికారి అంగీకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌచీ వద్ద సలహాదారుగా పని చేసిన డేవిడ్ మోరెన్స్ ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడించారు.కొవిడ్ వైరస్‌పై పరిశోధనలకు వెచ్చించిన నిధుల రికార్డులు, ఇతర పత్రాలను అధికారిక సిస్టమ్‌లో కాకుండా, చట్టాల నుంచి తప్పించుకోవడానికి వ్యక్తిగత ఇ-మెయిల్స్‌లో దాచినట్లు పేర్కొన్నారు. కొవిడ్ పరిశోధన గ్రాంట్లకు సంబంధించి ఏప్రిల్ 2020 నుంచి ఏజెన్సీకి అందిన ప్రజా రికార్డుల అభ్యర్థనలను అడ్డుకున్నట్లు డేవిడ్ మోరెన్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ఆయనను విచారించగా.. తన తప్పును అంగీకరించారు. కోవిడ్ మహమ్మారి మొదలైన సమయంలో ఆంథోనీ ఫౌచీ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' (ఎన్ఐఏఐడీ) అధిపతిగా ఉండగా, తాను సహాయకుడిగా ఉన్నానని ఫెడరల్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మోరెన్స్ పేర్కొన్నారు. వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్-19 ఉద్భవించిందన్న ఆరోపణల నేపథ్యంలో.. గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై చేస్తున్న పరిశోధన గ్రాంటును నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ రద్దు చేయాలని నిర్ణయించుకుంది.అయితే, ఆ గ్రాంటును పునరుద్ధరించడానికి ల్యాబ్ నుంచి కొవిడ్ లీక్ అయిందన్న విషయాన్ని తప్పుడు కథనంగా చూపేలా సాయం చేస్తానని మోరెన్స్ చైనాలోని యాజమాన్యానికి హామీ ఇచ్చారని ప్రాసిక్యూటర్లు తెలిపారు. అందులో భాగంగానే కరోనా సహజసిద్ధంగా, జంతువుల నుంచే వ్యాప్తి చెందిందనే వాదనను బలంగా ప్రచారం చేయించారన్నారు. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు వారు ప్రభుత్వ ఇ-మెయిల్ ఖాతాకు బదులుగా మోరెన్స్ వ్యక్తిగత ఖాతాను ఉపయోగించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు గుర్తించామన్నారు. దీంతో ఈ విషయంపై ఆంథోనీ ఫౌచీని కూడా విచారించే అవకాశం ఉంది. కరోనాపై ప్రమాదకర పరిశోధనల కోసం చైనాలోని వుహాన్ ప్రయోగశాలకు అమెరికా నుంచి నిధులు అందాయని, ఆ వైరస్ పుట్టుకపై వాస్తవాలను అగ్రరాజ్య ఉన్నతస్థాయి వ్యక్తులు తొక్కిపెట్టారని జూన్‌లో అమెరికా మాజీ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ వెల్లడించారు. ఈ మొత్తం కుట్ర వెనుక ఉన్న వ్యక్తి.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రధాన వైద్య సలహాదారుగా పనిచేసిన ఆంథోనీ ఫౌచీ అని పేర్కొన్నారు. త్వరలో ఫౌచీని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ కేసు విచారణలో కోవిడ్ మూలాల రికార్డులు దాచేందుకు కుట్ర పన్నినట్టు డేవిడ్ మోరెన్స్ చెప్పడం వల్ల ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో దీనిపై చర్చకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా అసలు రంగు బయటపడుతున్నదని పలు దేశాల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు.
అరుణాలచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

**అమరావతి,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):**
వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో జర్నలిస్ట్‌గా మారారు. ఫొటో జర్నలిస్ట్‌లు అందరిని కలిపి సీఎం గ్రూప్ ఫొటో తీశారు. కెమెరా తీసుకుని తానే ఫొటో తీస్తానని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఫొటో జర్నలిస్ట్‌లు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ.. జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు సీఎం అభినందనలు తెలిపారు. మానవ అనుభవాలను, అద్భుతమైన చిత్రాలుగా ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు చెప్పారు. మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల అంకితభావం, కళాత్మకత, నిరంతర కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీసీసీ సభ్యులు, డిసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.
క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

(మొదటి పేజీ తరువాయి)

లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయ పడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

- సీఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**హైదరాబాద్,ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**ఛాయాచిత్రం ఓ కల..**

**చరిత్రను భద్రపరిచే అద్భుత మాధ్యమం**

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంలో ఫోటోగ్రాఫర్స్**

**మండల అధ్యక్షులు మోదుగు రాంబాబు**






**కల్లూరు, ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫోటోగ్రాఫర్స్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షులు మోదుగు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఛాయాచిత్రం కేవలం ఒక చిత్రం కాదని, అది ఒక కళ, జ్ఞాపకం, చరిత్రకు ప్రతిరూపమని మోదుగు రాంబాబు అన్నారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్లూరు మండల ఫోటోగ్రాఫర్స్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణలో తొలిసారిగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించగా, మండల అధ్యక్షులు మోదుగు రాంబాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఫోటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన 187 వ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి, ఒకరికొకరు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంఘంలో సభ్యుడైన ఫోటోగ్రాఫర్ మృతి చెందితే, కుటుంబ సంక్షేమం కోసం రాష్ట్రములో నున్న కమిటీ సభ్యుల నుంచి 10 రూపాయలు సేకరించి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వారం రోజుల్లోగా బాధిత కుటుంబానికి 1లక్ష 80 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. పేద ఫోటోగ్రాఫర్ల పిల్లలు ఉన్నత విద్యలో రాణించినప్పుడు వారికి ఆసరాగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. నూతనంగా యూనియన్‌లో సభ్యులుగా చేరిన వారికి ఐడీ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఫోటోగ్రాఫర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఎన్నికల సమయంలో కూడా తమ వంతు విధులను నిర్వర్తిస్తున్నామని రాంబాబు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఫోటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, కెమెరాలు మరియు ఇతర పరికరాల కొనుగోలుకు రుణ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వమునకు విజ్ఞప్తి చేశారు. వృత్తిపరమైన శిక్షణ, సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కాలగర్భంలో కలిసిపోయిన ఎన్నో సంఘటనలను ఒకే ఛాయాచిత్రం భవిష్యత్ తరాలకు అందిస్తుందని, జీవితంలోని మరచిపోలేని మధుర జ్ఞాపకాలను పదిలంగా భద్రపరిచేది ఫోటోగ్రఫీ మాత్రమేనని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ నాణ్యమైన ఛాయాచిత్రానికి ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని పేర్కొన్నారు. సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాంస్కృతిక వేడుకలు, ప్రజల జీవితంలోని ప్రత్యేక ఘట్టాలను కెమెరాల్లో బంధిస్తూ ఫోటోగ్రాఫర్లు తమ వంతు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి రాయల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు జంగిలి శ్రీనివాసరావు, కోశాధికారి బంక వెంకట్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు, జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వరరావు, వేపూరి తిరుమలరావు, అబ్దుల్ హబీబ్, మద్రెల వెంకటేశ్వరావు, గౌరవ సలహాదారులు బీవీ, మాజీ ప్రధాన కార్యదర్శి రోజ్ వేణు, బొడ్డు కృష్ణ, మాజీ కోశాధికారి డేవిడ్, ఆదూరి ప్రభాకర్, వినోద్, రావూరి రవి, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# జేడీ మల్లంపల్లిలో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లతో సందడిగా వేడుకలు**

**జ్ఞాపకాలను శాశ్వతంగా బంధించే ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయం**




**జేడీ మల్లంపల్లి, ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** జేడీ మల్లంపల్లి మండల కేంద్రంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ స్టూడియో అధినేత బక్కి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మండలంలోని ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారంతా ఒకే వేదికపై కలుసుకుని కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బక్కి నాగరాజు మాట్లాడుతూ.. ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, మనిషి జీవితంలోని విలువైన క్షణాలను, మధురమైన జ్ఞాపకాలను శాశ్వతంగా భద్రపరిచే గొప్ప కళ అని పేర్కొన్నారు. ఒక సంఘటన కాలగర్భంలో కలిసిపోయినా, దానికి సంబంధించిన ఫోటో మాత్రం ఆ జ్ఞాపకాన్ని ఎప్పటికీ సజీవంగా ఉంచుతుందని తెలిపారు.వివాహాలు, పుట్టినరోజులు, శుభకార్యాలు, పండుగలు, సామాజిక కార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు, వివిధ వేడుకల్లో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. ప్రజల జీవితంలోని మరపురాని క్షణాలను తమ కెమెరాల్లో బంధించి భవిష్యత్ తరాలకు అందిస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ప్రస్తుతం ఫోటోగ్రఫీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆధునిక కెమెరాలు, డ్రోన్లు, వీడియో ఎడిటింగ్, డిజిటల్ టెక్నాలజీ వంటి అనేక మార్పులు వస్తున్న నేపథ్యంలో ఫోటోగ్రాఫర్లు కూడా ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను నేర్చుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో నాణ్యమైన సేవలు అందిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఐక్యంగా ఉండి పరస్పరం సహకరించుకోవాలని, వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను అందరూ కలిసి పరిష్కరించుకోవాలని అన్నారు. ఒకరి విజయాన్ని మరొకరు ప్రోత్సహిస్తూ ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేశాయి. కేక్ కట్ అనంతరం అందరూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇమ్మడి నరేష్, గోరంట్ల ప్రణయ్, ఎనగందుల అరుణ్, భయ్యా రాజేందర్, భూక్య రాజేందర్, ప్రకాష్ తదితర ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# మందుల వార్షిక ఇండెంట్ లను పారదర్శకంగా పెట్టాలి.

**• జిల్లా ఆసుపత్రి**

**సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్.**



**ములుగు జిల్లా ఆగష్టు19(పిసిడబ్ల్యూ న్యూస్):** మందుల కొరతను నివారించేందుకు.. మందుల వార్షిక ఇండెంట్ లను ఆస్పత్రిలోని అన్ని స్పెషలిస్ట్ విభాగాల సంబంధిత వైద్యులు ఫార్మసీ అధికారులు సంయుక్తంగా సమన్వయంగా అవసరమైన ఇండెంట్లను రూపొందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు బుధవారం ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర వైద్య మరియు మౌలిక సౌకర్యాల అభివృద్ధి సంస్థ (టి జి ఎం ఎస్ ఐ డి ) సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రికి చెందిన అన్ని స్పెషలిస్ట్ విభాగాధిపతులు అసోసియేట్ ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫార్మసీ విభాగం అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు సర్జికల్స్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని మందుల కొరత నివారించేందుకు సెంట్రల్ మెడిసిన్ స్టోర్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయంగా మందుల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలకు చెందిన వైద్యులందరూ సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ద్వారా సరఫరా అవుతున్న మందులు సర్జికల్స్ ఆసుపత్రి అవసరాల మేరకు వినియోగం ఆధారంగా ఎప్పటికప్పుడు మందులను తెప్పించుకుంటూ మందుల కొరత రాకుండా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

పూర్వపు వరంగల్ సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఇంచార్జ్ ఫార్మసీ ఆఫీసర్ ఉప్పు భాస్కరరావు మాట్లాడుతూ ఇకపై తరచూ ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్ లతో వైద్యులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ మందుల కొరత నివారించవచ్చని అన్నారు సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ద్వారా ఆసుపత్రులకు సరఫరా చేస్తున్న 628 మందుల, 536 సర్జికల్స్ సంబంధించిన బుక్లెట్లను ఆస్పత్రిలోని అందరు వైద్యులకు అందజేశారు. ఈసందర్భంగా సి ఎం ఎస్ ద్వారా పంపిణీ అయ్యే పుస్తకాలను వైద్యులకు అందించారు.ఈ సమావేశంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బిక్షపతి రావు, తోపాటు డాక్టర్ రామ్మోహన్ డాక్టర్ ఉషారాణి,డాక్టర్ శ్రీకళ,డాక్టర్ లకృతి డాక్టర్ సుప్రియ డాక్టర్ అనూష ఫార్మసీ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, ములుగు జిల్లా సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసీ అధికారులు సమ్మయ్య, కే శ్రీనివాస్ సి ఎం ఎస్ సిబ్బంది పి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ వర్షపాతం నేపథ్యంలో పంటల ఎంపికపై రైతులకు అవగాహన



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల సాగు చేపట్టాలని, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు అవగాహన కల్పించారు.అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు రైతులకు సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి అందించే ప్రోత్సాహకాలు, సహాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాధార పంటలు సాగు చేసే రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తక్కువ వర్షపాతం పరిస్థితులకు అనుకూలమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తక్కువ కాలపరిమితి కలిగిన పంటల సాగు, పంట మార్పిడి విధానాలను అవలంబించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతను అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ మార్పులు, వర్షపాతం అంచనాలు, పంటల ఎంపికకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల నుంచి తెలుసుకోవాలని సూచించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై గ్రామస్థాయిలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.మల్లంపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ) నల్లెల శ్రీధర్, రామచంద్రాపురం ఏఈఓ కావ్యతో పాటు పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**- తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ పనులపై సమీక్ష**



**కల్లూరు, ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమీక్ష సమావేశం 20 న నేడు గురువారం ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించాల్సిన మండల ప్రజా పరిషత్ సమీక్ష సమావేశంలో మండల పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించనున్నారు.సమావేశంలో ప్రధానంగా గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల పరిస్థితి, ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, వివిధ అభివృద్ధి పనుల స్థితిగతులపై చర్చించనున్నారు. అలాగే ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులు, ప్రజా సమస్యల పరిష్కారంలో తీసుకున్న చర్యలపై సమీక్ష జరగనుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, నిధుల వినియోగం తదితర అంశాలపై కూడా అధికారులు నివేదికలు సమర్పించనున్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖల ప్రగతిపై సంబంధిత అధికారులు సమగ్ర వివరాలను సమావేశంలో వెల్లడించనున్నారు.మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు నిర్ణీత సమయానికి సమావేశానికి హాజరై చర్చల్లో పాల్గొనాలని మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ కోరారు. ప్రతి శాఖకు సంబంధించిన తాజా ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

# రేపు నారాయణపురంలో భూ రీ సర్వేపై అవగాహన

**ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**సత్తుపల్లి, ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
సత్తుపల్లి మండల పరిధిలోని నేడు నారాయణపురం గ్రామంలో కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు అని మంత్రి కార్యాలయం ఇంచార్జ్ దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని బేతుపల్లి, రామానగరం, తాళ్లమడ, గంగారం, నారాయణపురం, రామగోవిందపురం, పాకాలగూడెం పంచాయతీల ప్రతినిధులు, రైతులు పాల్గొంటారు అని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియ, హక్కుల నమోదుపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు సంబంధిత గ్రామాల రైతులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# గౌడెల్లి రామకృష్ణమాదిగ మృతికి ఎమ్మార్పీఎస్ నేతల సంతాపం



**ఉప్పల్, ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** నాచారం వాస్తవ్యులు, దళిత జాతి ముద్దుబిడ్డ, కీర్తిశేషులు గౌడెల్లి రామకృష్ణమాదిగ మృతిపట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రంగ ప్రణయ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి మాదిగ, బొడ్డు శివ, అద్వైత్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.రామకృష్ణమాదిగ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

# కార్మికుల దీక్షలపై ప్రభుత్వం స్పందించాలి

**ప్రభుత్వం స్పందించకపోతే కార్యచరణ ప్రకటిస్తాం**

**చలమాల విఠల్ రావు సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు**



**పెనుబల్లి, ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్) :**గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు కోసం వచ్చిన జీవో నెంబర్ 60ని పకడ్బందీగా అమలు చేసి, కార్మికులపై పని భారం పెంచే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విటల్ రావు మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్మికులను, కార్మిక నాయకులను తక్షణమే చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన నిర్వహించి ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరస్వామి కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది అని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల దీక్ష సమ్మెకు వివిధ సంఘాల నాయకులు, పలురంగాల కార్మికులు సమ్మెకు సంపూర్ణ సంఘీభావం తెలియ జేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో న్యాయం ధర్మం నీతి ఉందని గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే సమ్మె దీక్షలు జరుగుతున్నాయని అన్నారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామని వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక నిరసన శిబిరాల, టెంట్ల వద్ద మద్దతు ప్రకటించి గతంలో చెప్పిన మాటలు, హామీలు, వాగ్దానాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ఎండా వాన చలిలో కష్టపడి పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు బడుగు బలహీన వర్గాలే కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందన్నారు. జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారాన్ని పెంచడం సరైంది కాదన్నారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించిన కనీస ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. కనీస ప్రాథమిక హక్కుగా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసి కార్పొరేట్లకు ఉపయోగపడేలా 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన బిజెపి సర్కార్ కు మద్దతుగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. కరోనా వంటి కష్టకాలాల్లో ప్రజల కోసం తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి ఆదుకున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైనది కాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సీఐటీయూ నాయకులను చర్చలకు ఆహ్వానించాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు కార్యచరణ రూపొందించి మరింత ఉధృతంగా పోరాటలు నిర్వహిస్తామని హెచ్చరిస్తూ దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, తడికమళ్ళ చిరంజీవి, గ్రామపంచాయతీ కార్మిక అధ్యక్ష కార్యదర్శులు రంగయ్య, వెంకటేశ్వరావు, వి. ఇజ్రాయిల్, లక్ష్మణ్, వెంకటేశ్వరావు, రామారావు, కిషోర్, భూక్య వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం




**హైదరాబాద్, ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రం డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, నగర స్థాయిల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కేంద్రాల ద్వారా కొత్త పాన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, పాన్ కార్డు వివరాల్లో సవరణలు, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, బ్యాంకు నగదు బదిలీలు, ఆధార్ ఆధారిత చెల్లింపు సేవలు, మైక్రో ఏటీఎం సేవలు, నగదు డిపాజిట్లు, హెల్త్, బైక్, కార్ ఇన్సూరెన్స్ సేవలు, వివిధ బిల్లుల చెల్లింపులు వంటి ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందించవచ్చని పేర్కొన్నారు.అలాగే 100కు పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆమోదించిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు నమోదు, 100కు పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆమోదించిన స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్లకు నమోదు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సంబంధించిన మాక్ టెస్టులకు నమోదు వంటి సేవలను కూడా అందించవచ్చని తెలిపారు.ప్రజలకు వివిధ ఆన్‌లైన్ సేవలను అందించడం ద్వారా కేంద్ర నిర్వాహకులు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వెంకట్ రెడ్డి వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు www.tsevaonline.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఫోన్: 8179955744వెంకట్ రెడ్డిడైరెక్టర్, టీ-సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రం, హైదరాబాద్

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం..

**• మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్..**



**మానకొండూరు ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూరు బాలుర ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై "నశా ముక్త్ భారత్ అభియాన్" ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ తరఫున 'నషా ముక్త్ భారత్ అభియాన్' ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు సమష్టిగా కృషి చేయాలని మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## "స్టూడెంట్ మార్చ్" విజయవంతం చేయండి..: బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం..



**కరీంనగర్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున తలపెట్టిన "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" "స్టూడెంట్ మార్చ్" ప్రోగ్రాం ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కోసం , విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో గీతా భవన్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న స్టూడెంట్ మార్చ్ ర్యాలీ కి యువకులు, విద్యార్థులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. పెండింగ్ రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" పేరిట బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, అందులో భాగంగా కరీంనగర్‌లో తలపెట్టిన ఈ భారీ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులురాంచందర్ రావు , బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులుకుండే గణేష్ హాజరవుతారని తెలిపారు.


# అనుమతులు లేకుండా విద్యారణ్య స్కూల్ నిర్వహణపై ఆరోపణలు


**మూసివేసినా..**

**మళ్లీ ఎలా తెరిచారు?**

**అనుమతులు ఎక్కడ?**

**అధికారుల చర్యలు ఏమిటి?**






**హైదరాబాద్ ఆగస్టు 19 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంబర్ పేట డివిజన్ పటేల్‌నగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై విద్యాశాఖకు ఫిర్యాదు చేయడంతో జూలై 6న పాఠశాలను మూసివేసినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు.అయితే రెండు రోజులు మూసివేసి.. మళ్లీ యథావిధిగా తరగతులు ఎలా నిర్వహిస్తున్నారు? ప్రస్తుతం పాఠశాలకు ఏ తరగతుల వరకు అనుమతులు ఉన్నాయి? అనుమతులు లేకపోతే తిరిగి పాఠశాల నిర్వహణకు ఎవరు అనుమతించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇదే పేరుతో వివేక్‌నగర్ రామంతపూర్‌లో మరో పాఠశాల కొనసాగుతుండటం, పటేల్‌నగర్ పాఠశాల విద్యార్థులను అక్కడి నుంచి 10వ తరగతి పరీక్షలకు పంపుతున్నారనే ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలోని అనుమతి లేని పాఠశాల విద్యార్థులు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ఎలా రాస్తున్నారు? అనే అంశంపైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై హిమాయత్‌నగర్ డిప్యూటీ ఎంఈఓ శ్యామల్ రాజుకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారులు ఆరోపించారు. దీంతో 13-08-2026న హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (ఐజూ)కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? పాఠశాలకు ఉన్న అనుమతులు, ప్రస్తుతం నిర్వహిస్తున్న తరగతులకు ఉన్న గుర్తింపులు, విద్యార్థుల పరీక్షల నిర్వహణకు సంబంధించిన అనుమతులు అన్నింటినీ విద్యాశాఖ తక్షణమే బహిర్గతం చేయాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, గతంలో పాఠశాలను మూసివేసిన తర్వాత తిరిగి నిర్వహణకు దారితీసిన పరిస్థితులపైనా సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.ఇది కేవలం ఒక పాఠశాల వ్యవహారం కాదు.. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా హక్కులు, భద్రతకు సంబంధించిన ప్రశ్న. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. తప్పైతే వాస్తవాలను విద్యాశాఖ స్పష్టంగా ప్రజల ముందు ఉంచాలి.

# వరలక్ష్మీ వ్రత వేడుకలకు ముస్తాబైన శ్రీ మహాశక్తి ఆలయం

**గురువారం సాయంత్రం ఫల పంచామృత అభిషేకాలు, మంగళద్రవ్యాభిషేకాలు ప్రారంభం**

**21 శుక్రవారం ఉదయం దేవాలయంలో మహాహారతి, ప్రత్యేక పూజలు, సాయంత్రం వరలక్ష్మి వ్రతం**




**కరీంనగర్ టౌన్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** పట్టణం చైతన్యపురిలోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి ల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం వరలక్ష్మి వ్రత వేడుకలకు ముస్తాబయింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులతో వరలక్ష్మీ వ్రతం పర్వదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆకర్షణీయమైన పూల, విద్యుత్ అలంకరణలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగాముస్తాబు చేశారు. ఈనెల 20, 21 తేదీల్లో గురువారం, శుక్రవారం రోజున శ్రీ మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక ఫల పంచామృతాభిషేకం, మంగళద్రవ్యభిషేకం పూజలు, వరలక్ష్మి వ్రతం ను నిర్వహిస్తున్నారు. 20వ తేదీ గురువారం రోజున సాయంత్రం 7 గంటలకు శ్రీ గణపతి, శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు ఫల పంచామృతాభిషేకం, మంగళద్రవ్యాభిషేకం 21వ తేదీ శ్రావణ శుక్రవారం - వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఉదయం 7.30 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, మహా హారతి, సాయంత్రం 6.30 గంటలకు వరలక్ష్మి వ్రతము, సామూహిక కుంకుమార్చన అనంతరం తీర్థ ప్రసాద వినియోగం చేపట్టనున్నారు. ముఖ్యంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో వరలక్ష్మి వ్రతానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడి దేవాలయంలో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు అదృష్ట దేవతగా భావిస్తుంటారు. ఆలయంలో వరలక్ష్మి వ్రతం చేపట్టిన మహిళలకు లక్ష్మీదేవి అనుగ్రహం, సకల సంపదలు, కుటుంబాల శ్రేయస్సు లభిస్తుందని ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు. 20, 21తేదీల్లో శ్రీ మహాశక్తి దేవాలయంలో జరిగే ప్రత్యేక పూజ కార్యక్రమాలు, వరలక్ష్మీ వ్రత వేడుకలకు సమస్త భక్తులు , మహిళలు తరలివచ్చి అమ్మవార్ల అనుగ్రహం పొందగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# కరీంనగర్‌లో నేడు“ స్టూడెంట్ మార్చ్“ ‘ఫీజుల బకాయి - బిజెపి లడాయి‘ ప్రోగ్రాం .....

**హాజరుకానున్న బిజెపి స్టేట్ చీఫ్ రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ , బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ ...**

**-ప్రోగ్రాం ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున చేపట్టనున్న “ఫీజుల బకాయి - బిజెపి లడాయి“ “స్టూడెంట్ మార్చ్“ ఏర్పాట్లను బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, బీజేవైఎం నేతలతో కలిసి పరిశీలించారు. గీతా భవన్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీ మార్గం , కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి, బీజేవైఎం నేతలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా బోయిన్పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.విద్యార్థుల భవిష్యత్తు జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన పెండింగ్ రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. “ఫీజుల బకాయి - బిజెపి లడాయి“ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని, అందులో భాగంగా కరీంనగర్‌లో తలపెట్టిన ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రముఖులు ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులురాంచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ , బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ హాజరవుతారని తెలిపారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి





**మానకొండూర్ ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి గ్రామంలో పాండ్రాల స్వప్నప్రవీణ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అండగా నిలుస్తాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న స్వప్నప్రవీణ్ దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, స్థానిక సర్పంచ్ కనకం సుజాత- సంపత్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం కుమార్, గట్టు దుద్దెనపల్లి చైర్మన్ సొసైటీ చైర్మన్ గంగుల రాంరెడ్డి, వైస్ చైర్మన్ కనక రాజేశం, పార్టీ నాయకులు ఓదెల యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమల్ రెడ్డి, వై.సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బాకారపు సమ్మయ్య,బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**UIDF నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన నగర కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్.**



**కరీంనగర్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 39వ డివిజన్ పోచమ్మవాడలో UIDF నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోచమ్మవాడలో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు, పారిశుద్ధ్య పరంగా మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావ్, కార్పొరేటర్లు మాసం గణేష్, తాటి ప్రభావతి, బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, దేవసాని సరస్వతి సత్యనారాయణ, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఈస్ట్ జోన్ నాయకులు, పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు శౌనక్‌ను సన్మానించిన కేంద్ర మంత్రి బండి సంజయ్...



**కరీంనగర్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** స్పెయిన్‌లో జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన కరీంనగర్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారుడు శౌనక్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు. కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఈ అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. జూలై 2 నుండి ఆగస్టు 1 వరకు స్పెయిన్‌లో అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ నిర్వహించబడింది. ఈ టోర్నీలో అద్భుతంగా ఆడిన శౌనక్ 175 ఎఫ్ఐడీఈ రేటింగ్ పాయింట్లు సాధించారు. చిన్న వయస్సులోనే మాస్టర్ సీఎం, ఎఫ్ఎం టైటిల్స్ సాధించడం విశేషం. చిన్నతనంలోనే అంతర్జాతీయ స్థాయిలో అరుదైన విజయాలు సాధించి, కరీంనగర్ కీర్తిని ఇనుమడింపజేయడం జిల్లాకే గర్వకారణమని బండి సంజయ్ కొనియాడారు. ఈ సందర్భంగా శౌనక్ తల్లిదండ్రులతో పాటు కోచ్‌లు రామరాజు, అనూప్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, శౌనక్ తల్లిదండ్రులు ప్రసాద్, అపూర్వ, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




**ఎల్‌నినోపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టండి**

**సర్పంచులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన..**

**మానకొండూర్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు, ఎల్ నినో ప్రభావం తీవ్రత తగ్గించేందుకు గ్రామాల్లో సర్పంచులు ప్రత్యామ్నాయ చర్యలు సత్వరమే చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. బుధవారం మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీవీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని, నీటి వనరుల వద్ద పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలుషిత నీటి కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు.ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం లోపం, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న దృష్ట్యా దీన్ని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, తక్కువ నీటితో సాగయ్యే, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను ప్రోత్సహించాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి నీటి పొదుపు పద్ధతులను విస్తరించాలని,వర్షాభావ పరిస్థితులకు అనుకూలమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.పశువులకు ముందస్తుగా మేత, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాలు, ఉష్ణోగ్రతలపై ముందస్తు సమాచారాన్ని రైతులకు చేరవేయాలన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖలు కలిసి మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు.**పంచాయతీల బలోపేతానికి కృషి** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకనే పంచాయితీల బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బలోపేతం అయ్యాయని చెప్పారు. గత పాలకులు అడ్డగోలు ఖర్చు పెట్టడం వల్ల రాష్ట్ర రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, తీగల లోతు అప్పుల్లో ఊరుకు పోయిందని చెప్పారు. ఈ కారణం వల్లనే బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్నదే తప్ప ప్రభుత్వం కావాలని చేస్తున్నది ఎంత మాత్రం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా సర్పంచులు ప్రజాప్రతినిధులు ప్రజలు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. అభివృద్ధి విషయంలో అన్ని గ్రామాలను సర్పంచులను ఒకే రకంగా చూస్తానని ఇందులో ఎలాంటి వ్యత్యాసం చూపించబోనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఆయన తెలిపారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు ఉప సర్పంచ్ల మధ్య నెలకొన్న విభేదాల వల్ల అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చెక్కు పవర్ విషయంలో ఎదురవుతున్న సమస్యలు నివారించే దిశగా ప్రభుత్వం త్వరలో తగు నిర్ణయం తీసుకోనున్నదని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం,పశు వైద్యం,నీటి పారుదల, మిషన్ భగీరథ, ఐసీడీఎస్, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించి సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మానకొండూరు తాసిల్దార్ విజయకుమార్ తోపాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.**ఆధార్ కేంద్రం ప్రారంభం** మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నెలకొల్పిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.



# 54వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ 54వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. UIDF నిధులతో చేపట్టనున్న జజ రోడ్డు, SWG పైపులైన్ పనులకు, అలాగే మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న RCC డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కరీంనగర్ నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తి చేసి, కాలనీల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని వారు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ గొట్టుముక్కల ఉమారాణి వెంకటరమణ, కార్పొరేటర్లు వంగల పవన్, బండ రమణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, తాటి ప్రభావతి, మాసం గణేష్, గుగ్గిళ్లపు రమేష్‌లి గాజా శివరాం, ఎన్నం ప్రకాష్‌లి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన రుణాలపై సమీక్షా సమావేశం




**కర్నూలు ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన రుణాలపై సమీక్షా సమావేశం కర్నూలు విద్యుత్ భవన్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించిన రుణాలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్.ఈ. ప్రదీప్ కుమార్, ఎల్.డి.ఎం. పి. మోహన్, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, అధికారులు, సౌర విద్యుత్ వెండర్లు పాల్గొన్నారు. సమావేశంలో సౌర విద్యుత్ రుణాల మంజూరు, దరఖాస్తుల పరిశీలన, రుణాల పంపిణీలో ఎదురవుతున్న సమస్యలు, పోర్టల్‌లో సాంకేతిక ఇబ్బందులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు గ్రీన్ ఎనర్జీ, ముఖ్యంగా సౌర విద్యుత్ వినియోగం ఎంతో కీలకమని తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సౌర వెండర్లు మరియు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, వెండర్లు మరియు బ్యాంకులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎల్.డి.ఎం. పి. మోహన్ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 10,000 ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన దరఖాస్తులను సోర్స్ చేసి, అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణ సౌకర్యం అందించే లక్ష్యంతో బ్యాంకులు, వెండర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బ్యాంకుల వైపు నుంచి దరఖాస్తుల పరిశీలన, రుణ మంజూరు, డిస్బర్స్‌మెంట్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి పథకం లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సౌర వెండర్లుమాట్లాడుతూ..కొన్ని దరఖాస్తుల్లో సిబిల్ స్కోర్‌కు సంబంధించిన అంశాలు, పోర్టల్‌లో పేర్లలో వ్యత్యాసాలు,బ్యాంక్ బ్రాంచి ల లో దరఖాస్తుల ప్రాసెసింగ్‌లో ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వివిధ బ్యాంకుల అధికారులు స్పందిస్తూ, అర్హత కలిగిన లబ్ధిదారుల దరఖాస్తులను వేగంగా పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి రుణాలను వీలైనంత త్వరగా డిస్బర్స్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సౌర విద్యుత్ విస్తరణ ద్వారా జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడం, విద్యుత్ పొదుపు సాధించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన లక్ష్యాలను విజయవంతంగా సాధించేందుకు బ్యాంకులు, సౌర వెండర్లు, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

## కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు




**కర్నూలు ఆగస్టు 19(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సమీకరణ, సిబ్బంది నియామకం, శిక్షణ, భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతాయుతమైన ప్రక్రియ కావడంతో చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశానికి ముందుగానే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రి, సిబ్బంది శిక్షణ తదితర ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ వ్యవస్థ ద్వారా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, స్వీప్ కార్యక్రమాలు, పరిశీలకుల నియామకం, నామినేషన్లు, నోటీసులు తదితర ప్రక్రియలను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి దశకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది, ఎన్నికల సామగ్రి, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందుగానే పరిశీలించి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ భాస్కర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే వైకాపా కోర్టు డ్రామాలు

## పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి

## మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధం

## దమ్ముంటే పిటిషన్ వెనక్కి తీసుకోండి

## విద్యార్థులను ధర్నాలకు తరలించడంపై తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్




**పులివెందుల ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక వైకాపా నాయకులు కోర్టులను ఆశ్రయిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల విభజన, ఓటర్ల మార్పులను సాకుగా చూపి ఎన్నికలపై స్టే తెచ్చేందుకు వైకాపా మాజీ కౌన్సిలర్ ద్వారా హైకోర్టును ఆశ్రయించడం వారి నైతిక పరాజయానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం ప్రత్యక్ష ఎన్నికలకు సిద్ధంగా ఉందని, దమ్ముంటే కోర్టులోని పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకుని ఎన్నికలను ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు మరియు తల్లిదండ్రుల అనుమతి లేకుండా విద్యార్థులను రాజకీయ ధర్నాలకు తరలించడం ముమ్మాటికీ తప్పిదమని బీటెక్ రవి స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (దీఛా) సెక్షన్ 137(1)(ఎ) ప్రకారం ఇది చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు విద్యాసంస్థలే కేసులు పెట్టాయని ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన నాయకుడు పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు, రోడ్ల విస్తరణ వంటి అంశాలపై మాట్లాడకుండా స్థానిక వ్యక్తిగత ప్రయోజనాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ముద్దనూరుతాడిపత్రి లైన్‌కు బలాపనూరు మీదుగా ఫోర్‌లైన్ అనుసంధానం చేయాలని తాము కోరుతుంటే, నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం తోడ్పడని వైఖరిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో పులివెందుల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుంట్ల మధుసూదన్ రెడ్డి పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల విచారణకు 244 మంది హాజరు



**సిద్ధవటం ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై బుధవారం సిద్ధవటం సచివాలయంలో నిర్వహించిన విచారణకు 244 మంది హాజరైనట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సిద్ధవటం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటర్లకు విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సిద్ధవటం గ్రామ పంచాయతీకి చెందిన 244 మందితో పాటు బందారుపల్లి, ఎగువపేట గ్రామాలకు చెందిన 386 మంది ఓటర్లను కూడా విచారించినట్లు తెలిపారు. విచారణ సందర్భంగా ఓటర్లు సమర్పించిన సంబంధిత ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**అనంతపురం ఆగస్టు 19(పిసి డబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని మధ్యతరహా, చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మీడియం, స్మాల్ డైలీస్ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణతో పాటు వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టుల హక్కుల కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల్లో మధ్యతరహా, చిన్న, ఇతర పత్రికలకు 30 శాతం వాటా కల్పించాలని నూతన కమిటీ సభ్యులు కోరారు. పత్రికల ఎంపానెల్‌మెంట్ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యక్రమాలు, వార్తల కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు ప్రమాద బీమా కల్పించాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. **అనంతపురం జిల్లా నూతన కమిటీ** గౌరవాధ్యక్షుడిగా శంకర ప్రసాద్ (తెలుగోడు), అధ్యక్షుడిగా డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ (ధర్మ విజేత), ఉపాధ్యక్షులుగా లోకేష్ (అనంత కోకిల), రామాంజినేయులు (మనం), జోడు రమేష్ (కదిలించే వార్త), ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీరాములు (నారి–భేరి) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ప్రసాద్ (బహుజన వేదిక), నాగేంద్ర (అనంత కళా వేదిక), శరత్ కుమార్ రెడ్డి (అక్షర ప్రభ), కోశాధికారిగా జీ. ఆనంద్ (అక్షయ న్యూస్) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సీనియర్ జర్నలిస్టులు సుబ్బయ్య (ప్రజాబాట), సంజీవ రెడ్డి (సాయంకాలం), భూపాలం సతీష్ కుమార్ (వినియోగ దర్శిని), భాస్కర్ (జన సూర్య), భాస్కర్ (మనం), నరసింహమూర్తి (నలివేటి ఎక్స్‌ప్రెస్), హరికృష్ణ (అనంత సూర్య), బాలరాజు (జన సూర్య) ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిరిసాల సురేష్ (నేషలిస్ట్ హబ్) ఎన్నికయ్యారు. **శ్రీ సత్యసాయి జిల్లా నూతన కమిటీ** గౌరవాధ్యక్షుడిగా ఎన్. నారాయణ (రాయల్ న్యూస్ పక్షపత్రిక, హిందూపురం), అధ్యక్షుడిగా బి. రవీంద్రనాయక్ (వాయిస్ ఆఫ్ విక్టరీ ఎడిటర్, కదిరి), ప్రధాన కార్యదర్శిగా కే.ఎన్. నాగరాజు (పల్లె జీవనం మాసపత్రిక ఎడిటర్, మడకశిర) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు (జనతరంగం డైలీ, ధర్మవరం), కోలా బ్రహ్మయ్య (సంధ్యవేళ సాయంకాలం, కదిరి), జాయింట్ సెక్రెటరీగా పి. మల్లిక (జాబిలి మాసపత్రిక, పెనుగొండ), కోశాధికారిగా పి. మహబూబ్ బాషా (ఆంధ్ర ప్రతి దినపత్రిక, కదిరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షుడు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ సూర్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, సుబ్బయ్య, శంకర ప్రసాద్, బాబ్జాన్, సురేష్, శ్రీరాములు, ఓ. భాస్కర్, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, రామ్మూర్తి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొలి టెస్టులో లంక చిత్తు..



## 165 రన్స్ తేడాతో భారత్ ఘనవిజయం

## 10 వికెట్లతో చెలరేగిన మానవ్ సుతార్

## సిరీస్ లో 1-0 ఆధిక్యంలో టీమ్ ఇండియా

గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. దేశానికి ఇది ల్యాండ్‌మార్క్ 600వ టెస్ట్ మ్యాచ్ కాగా, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు 165 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. డబ్ల్యూటీసీ (ఔజ) ఫైనల్ రేసులో అత్యంత కీలకమైన ఈ పోరులో యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టి విజయకేతనం ఎగురవేశాడు. 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, బుధవారం ఐదో రోజు పోస్ట్ లంచ్ సెషన్‌లో 77.4 ఓవర్లలో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సోనాల్ దినుష (84) మరోసారి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రెండో టెస్టు కొలంబోలో ఈనెల 23 నుంచి జరుగుతుంది. రెండో ఇన్నింగ్స్‌లో 24 ఏళ్ల మానవ్ సుతార్ అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో లంక వెన్నువిరిచాడు. కేవలం 55 రన్స్ మాత్రమే ఇచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టి తన తొలి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో తీసిన 4 వికెట్లతో కలిపి మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 2/16 తో అద్భుత సహకారం అందించగా, పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ దక్కించుకున్నారు. దినేష్ చండిమాల్ కంకషన్ కారణంగా వైదొలగడం, అతడి స్థానంలో వచ్చిన పసిందు సూరియబండార గోల్డెన్ డకౌట్ అవ్వడం లంకను కోలుకోలేని దెబ్బతీసింది. కెప్టెన్ ధనంజయ డి సిల్వా, సోనాల్ దినుష కాసేపు పోరాడినా భారత స్పిన్ దాడిని తట్టుకోలేకపోయారు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇండియా, సాయి సుదర్శన్ స్థానంలో నంబర్ 3 లో వచ్చిన దేవదత్ పడిక్కల్ క్లాసిక్ సెంచరీ (167) తో తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులు సాధించింది. కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో సొనాల్ దినుష సెంచరీ, నిరోషన్ డిక్వెల్లా (80) పోరాటంతో 284 రన్స్ చేయగా, ఇండియాకు 178 పరుగుల భారీ లీడ్ లభించింది.రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ కేవలం 53 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి, టెస్ట్ క్రికెట్ చరిత్రలో వేగంగా 100 సిక్సర్లు కొట్టిన తొలి భారతీయ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. పడిక్కల్ 44, రాహుల్ 35 రన్స్ చేసి సహకరించారు. గాలేలో అత్యధిక విజయవంతమైన ఛేజ్ 344 మాత్రమే కాగా, 372 రన్స్ ఛేజింగ్‌లో లంక ఏ దశలోనూ విజయం వైపు సాగలేకపోయింది. చారిత్రక 600వ టెస్టులో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గిల్ సేన డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో కీలకమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది.కాగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించినప్పటికీ భారత్ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ తర్వాతి స్థానంలోనే కొనసాగుతోంది. ఈ మ్యాచ్ ఫలితం అనంతరం భారత్ పాయింట్ పర్సంటేజీ పెరిగింది. కానీ టేబుల్‌లో పొజిషన్‌లలో మాత్రం ఎలాంటి తేడా లేదు. ప్రస్తుతం టీమ్‌ఇండియా 53.33 పర్సంటేజీతో ఐదో స్థానంలో ఉంది. తాజా మ్యాచ్ ఫలితం పట్టికలో ఏ జట్టు స్థానాన్ని కూడా ప్రభావితం చేయలేదు. అయితే భారత్ పర్సంటేజీ మాత్రం 48.15 నుంచి 53.33కు పెరిగింది.

అదే సమయంలో శ్రీలంక 41 నుంచి 33.33 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం భారత్ ఐదో ప్లేస్‌లో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, బంగ్లాదేశ్ మాత్రం భారత్ కంటే మెరుగైన ప్లేస్‌లో ఉంది. ఆ జట్టు రీసెంట్‌గా ఆస్ట్రేలియాపై సాధించిన విజయమే అందుకు కారణం. బంగ్లా ప్రస్తుతం 66.67 పాయింట్ పర్సంటేజీతో నాలుగో స్థానంలో ఉంది. ఇక ఈ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 77.78 శాతంతో టాప్‌లో ఉంది. సౌతాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమ్‌ఇండియా ఇప్పటిదాకా 10 మ్యాచ్‌లు ఆడగా, అందులో ఐదింట నెగ్గింది. మరో నాలుగు టెస్టుల్లో ఓడిపోగా, ఒకటి డ్రా చేసుకుంది. ఈ సైకిల్‌లో భారత్ ఇంకా ఎనిమిది టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఫైనల్ చేరుకోవాలంటే ఇకపై గిల్ సేన ఆడనున్న ప్రతీ టెస్టు కీలకం అనే చెప్పాలి. ఈ సిరీస్‌లో భారత్ తమ తదుపరి మ్యాచ్ ఈనెల 23న కొలంబో వేదికగా ఆడనుంది. ఈ పర్యటన తర్వాత టీమ్‌ఇండియా ఈ ఏడాది నవంబర్‌లో న్యూజిలాండ్ వెళ్లాల్సి ఉంది. అక్కడ ఆతిథ్య జట్టుతో భారత్ రెండు మ్యాచ్‌ల సిరీస్ ఆడాల్సి ఉంటుంది. ఆ తర్వాత సొంత గడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పోటీపడాల్సి ఉంది. ఈ సిరీస్ 2027 ఫిబ్రవరిలో ఉండే అవకాశం ఉంది. ఆసీస్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించడంతో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే భారత్‌కు ఇకపై ఆడనున్న ప్రతి టెస్టు నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఎనిమిదింట్లో ఏడు నెగ్గి ఒకటి ఓడిపోతే అప్పుడు భారత్ 68.52 పర్సంటేజీతో ఉంటుంది. అదే ఆరు టెస్టుల్లో విజయం సాధించి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైతే పాయింట్ పర్సంటేజీ 62.96 గా ఉంటుంది. భారత జట్టుకు ఎటువంటి పెనాల్టీ పాయింట్లు విధించకపోతేనే ఈ పరిస్థితులు సాధ్యమవుతాయి. కాబట్టి, శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా రాబోయే సిరీస్‌ల్లో పొరపాట్లకు ఏమాత్రం తావు లేకుండా ఆడాల్సి ఉంటుంది.

# టీమిండియా మైండ్ గేమ్ అదుర్స్!



శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ ఐదో రోజు ఆటలో టీమ్ ఇండియా యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తన మైండ్ గేమ్‌తో లంక వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్వెల్లాను బోల్తా కొట్టించాడు. బ్యాటింగ్ చేస్తున్న డిక్వెల్లాను క్లోజ్ ఫీల్డింగ్ లో ఉన్న జైస్వాల్ మాటలతో రెచ్చగొట్టి పెద్ద షాట్ ఆడేలా టెంప్ట్ చేశాడు. జైస్వాల్ వేసిన ఈ మైండ్ ట్రాప్ లో పడిన డిక్వెల్లా ఆ మరుసటి బంతికే భారీ షాట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు.డిక్వెల్లా క్రీజులో ఉన్నప్పుడు జైస్వాల్ దగ్గరగా వచ్చి మాటల యుద్ధం స్టార్ట్ చేశాడు. “కమాన్ యార్, ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఎన్నో షాట్లు ఆడావు కదా, ఇప్పుడు ఏదైనా చూపించు. డీప్ స్క్వేర్ లెగ్ వైపు సిక్స్ కొట్టు” అని జైస్వాల్ రెచ్చగొట్టాడు. దీనికి డిక్వెల్లా రియాక్ట్ అవుతూ, “ఇప్పుడు అవసరం లేదు, నన్ను ఐపీఎల్ కు తీసుకెళ్లు, అప్పుడు సిక్స్ కొట్టి చూపిస్తా” అని బదులిచ్చాడు. వెంటనే జైస్వాల్ స్పందిస్తూ “తప్పకుండా తీసుకెళ్తాం, నువ్వు ఒక్క సిక్సర్ కొట్టు, నిన్ను ఐపీఎల్ కు తీసుకెళ్లే బాధ్యత నాది” అని ఊరించాడు. ఈ మాటలతో ఏకాగ్రత కోల్పోయిన డిక్వెల్లా భారీ షాట్ కొట్టాలనే తొందరపాటులో పడ్డాడు. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ వరుసగా సంధించిన షార్ట్ పిచ్ బౌన్సర్లలో ఒకదానిని ఆడే క్రమంలో బంతి ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతికి చిక్కింది. దాంతో లంక కీలక వికెట్ కోల్పోయింది. జైస్వాల్ తెలివిగా ఆడిన మైండ్ గేమ్ ఇండియాకు ఒక క్రూషియల్ బ్రేక్ త్రూ అందించింది. గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. భారత్ కు ఇది ల్యాండ్‌మార్క్ 600వ టెస్ట్ మ్యాచ్ కాగా, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు 165 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో అత్యంత కీలకమైన ఈ పోరులో యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ మ్యాచ్ మొత్తంలో 10 వికెట్లు పడగొట్టి విజయకేతనం ఎగురవేశాడు. 372 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, బుధవారం ఐదో రోజు పోస్ట్ లంచ్ సెషన్‌లో 77.4 ఓవర్లలో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో సోనాల్ దినుష (84) మరోసారి టాప్ స్కోరర్ గా నిలిచాడు. రెండో టెస్టు కొలంబోలో ఈనెల 23 నుంచి జరుగుతుంది.



# మూడో స్థానంపై చర్చలను కొట్టిపడేసిన పడిక్కల్

**స్పోర్ట్స్ డెస్క్:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో వన్‌డౌన్ బ్యాటర్‌గా వచ్చిన దేవదత్ పడిక్కల్(167) అద్భుతమైన శతకం చేశాడు. దీంతో దాదాపు రెండేళ్ల తర్వాత భారత తరఫున టెస్టుల్లో వన్ డౌన్ బ్యాటర్ సెంచరీ చేశాడు. సాయి సుదర్శన్ గాయం కారణంగా దూరం కావడంతో వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ఈ మ్యాచ్ కంటే ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లోనూ పడిక్కల్ సెంచరీతో మెరిశాడు. దీంతో మూడో స్థానంలో అద్భుతమైన ప్లేయర్ దొరికాడని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అంతేకక కొందరు అయితే సాయి సుదర్శన్‌తో పడిక్కల్‌ను పోలుస్తున్నారు.వన్‌డౌన్ బ్యాటింగ్ విషయంలో వస్తున్న చర్చలపై పడిక్కల్ స్పందిస్తూ... తాను ఇలాంటి రేస్‌కు దూరంగా ఉంటానని.. అవకాశం వచ్చినప్పుడు ఏ స్థానంలోనైనా నిరూపించుకోవడానికి సిద్ధమని స్పష్టం చేశాడు. మూడో స్థానం తనకు సుదీర్ఘం కాలం వచ్చేసినట్లు బయట చాలా చర్చ సాగుతోందని, కానీ, తనకు అలాంటివి ఇష్టం ఉండదని తెలిపాడు. ఎప్పుడు, ఏ స్థానంలో అవకాశం వచ్చినా సిద్ధంగా ఉంటానని, అంతేకానీ, ఎంపిక గురించి తనకు ఎలాంటి ఆందోళన లేదని పడిక్కల్ వెల్లడించాడు.పోటీ ఎక్కువ ఉన్న సమయంలో ఇక్కడ ఆటే కొలమానమని, మనం బాగా ఆడకపోతే జట్టులో కొనసాగడం కష్టమని క్రీడల్లోనే కాదు.. ఉద్యోగంలోనూ అంతేనని పేర్కొన్నాడు. సరైన ప్రదర్శన ఇవ్వకపోతే అవకాశాలు రావని, ఛాన్స్ వస్తే మాత్రం పరుగులు చేసేందుకు వందశాతం ప్రయత్నిస్తామని, అలా చేస్తే మరిన్ని మ్యాచులు ఆడొచ్చని తెలుసని పడిక్కల్ తెలిపాడు.

# కోహ్లీ సలహాలు నా జీవితాన్నే మార్చేశాయి: ఇంగ్లండ్ క్రికెటర్

**స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ క్లోహీకి సామాన్యులతో పాటు సెలబ్రిటీల్లో కూడా అభిమానులు ఉన్నారు. అంతేకాక అతడు ఎంతో మందికి యువ ప్లేయర్లకు స్ఫూర్తిగా నిలిచాడు. ఇక అంతర్జాతీయ, దేశవాళీ, ఇతర లీగ్స్ సమయంలో తన సహచరులకు విలువైన సలహాలు ఇచ్చేవాడు. ఈ క్రమంలోనే కోహ్లీ సలహాలతో తమలో మార్పులు వచ్చిందని అనేక మంది యువ క్రికెటర్లు తెలిపారు. తాజాగా ఇంగ్లండ్ యువ క్రికెటర్ కూడా కింగ్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. మరి.. ఆ ప్లేయర్ ఎవరు, ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...ఓ ఇంటర్నేషనల్ ఛానల్‌తో ఇంగ్లండ్ యువ క్రికెటర్ జార్డన్ కాక్స్ మాట్లాడుతూ.. కోహ్లీ గురించి పలు విషయాలను వెల్లడించాడు. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున తుది జట్టులో ఆడే అవకాశం దక్కలేదని, అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో విరాట్‌తో గడిపిన క్షణాలు తన జీవితాన్నే మార్చేశాయని కాక్స్ వెల్లడించారు.క్రికెట్‌లో పెద్ద మ్యాచులు, అరంగేట్రం సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో కోహ్లీ తనకు అద్భుతమైన సలహా ఇచ్చాడని కాక్స్ తెలిపాడు. జీవితంలో ఒక్కసారే అరంగేట్రం వస్తుందని, మన కష్టపడిన వారి త్యాగాలను గుర్తుంచుకుని మైదానంలో ప్రతిభను చాటుకోమని కోహ్లీ ధైర్యం చెప్పినట్లు అతడు గుర్తుచేసుకున్నాడు.న్యూజిలాండ్‌తో జరగాల్సిన తన తొలి టెస్ట్ మ్యాచ్‌కు కేవలం మూడు రోజుల ముందు గాయపడటంతో కాక్స్ మానసికంగా కుంగిపోయాడు. ఆ సమయంలో ఇక క్రికెట్ ఆడలేనేమోనని భయపడిన తనకు కోహ్లీ చెప్పిన మాటలు ధైర్యాన్ని ఇచ్చాయని కాక్స్ తెలిపాడు. మైదానంలో కోహ్లీ ఎంత దూకుడుగా ఉంటాడో, బయట అంతకంటే వినయంగా, దయ ఉంటాడని అతడు పేర్కొన్నాడు. మైదానంలో అగ్రెసివ్‌గా ఉంటూనే, బయట వారితో ఎలా ప్రవర్తించాలనేది కోహ్లీని చూసి నేర్చుకున్నానని కాక్స్ వెల్లడించాడు.

# రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర..



శ్రీలంకతో గాలే అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జడేజా, టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న జడేజా, మూడో రోజు ఆటలో లంక బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు సోమవారం ఉదయం సెషన్‌లో శ్రీలంక టెస్ట్ కెప్టెన్ ధనంజయ డి సిల్వాను ఔట్ చేయడం ద్వారా జడేజా తన వికెట్ల ఖాతాను తెరిచాడు. అనంతరం మూడో సెషన్‌లో కేశర నువాంత వికెట్‌ను పడగొట్టి తన టెస్ట్ కెరీర్‌లో 350 వికెట్ల మైలురాయిని లాంఛనంగా అధిగమించాడు. 2012లో టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన జడేజా, గాలేలో తన 90వ టెస్ట్ మ్యాచ్ ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం. టెస్ట్ క్రికెట్ చరిత్రలో భారత్ తరఫున 350 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 619 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు (1990-2008 మధ్య 132 టెస్టులు). కుంబ్లే తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (537 వికెట్లు), కపిల్ దేవ్ (434 వికెట్లు), హర్భజన్ సింగ్ (417 వికెట్లు) ఉన్నారు. ఇప్పుడు వారి సరసన జడేజా సగర్వంగా నిలిచాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా, ఆల్ రౌండర్‌గానూ జడేజా ప్రపంచ స్థాయి రికార్డును నెలకొల్పాడు. టెస్టుల్లో 4,000 కంటే ఎక్కువ పరుగులు చేసి, 350కి పైగా వికెట్లు తీసిన ప్రపంచంలోనే నాలుగో క్రికెటర్‌గా, భారత్ తరఫున దిగ్గజం కపిల్ దేవ్ తర్వాత రెండో ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన దిగ్గజాల జాబితాలో.. కపిల్ దేవ్ ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అతడు 131 టెస్టుల్లో 5,248 పరుగులు, 434 వికెట్లు సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్).. 102 టెస్టుల్లో 5,200 పరుగులు, 383 వికెట్లు.. డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్).. 113 టెస్టుల్లో 4,531 పరుగులు, 362 వికెట్లు.. రవీంద్ర జడేజా (భారత్).. 90 టెస్టుల్లో 4,108 పరుగులు.. 350ం వికెట్లు జూన్ 2026లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు ఎంపిక కాని జడేజా, లంకతో సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చి సత్తా చాటాడు. ఇప్పటివరకు 134 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో 4,108 పరుగులు పూర్తి చేసిన జడేజా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 13 పరుగులు చేశాడు. తాజా ప్రదర్శనతో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు.



# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

## - వాయిదా వార్తలను ఖండించిన టీమ్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు

టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు.అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# టాక్సిక్ .. పెద్దల సినిమా మాత్రమే

## - పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే



ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.